విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

సోమవారం 05 మే 2025 8 పేజీలు

ఘోర రోడ్డు ప్రమాదాలు

- ❑ 30 నిమిషాల వ్యవధిలో ఒకేచోట మూడు ప్రమాదాలు
- ❑ ఐదుగురు అక్కడికక్కడే మృతి మరొకరి పరిస్థితి విషమం
- ❑ మృతుల్లో ముగ్గురు నెల్లూరు వాసులు
- ❑ ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర-ఒంగోలు : అప్పుడే తెల్లవారుతుంది. మరో గంటలో గమ్యస్థానాలకు చేరుకుంటారు. అలాంటి సమయంలో వేగం వారిపాలిట మృత్యువుగా మారింది. ఆగివున్న లారీని విజయవాడ నుండి నెల్లూరు వైపు వెళ్తున్న కోడిగుడ్ల లారీ ఆగివున్న ఢీ కొట్టడంతో లారీలో ఉన్న డ్రైవర్‌తో పాటు ఇద్దరు క్లీనర్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ముగ్గురు నెల్లూరు ప్రాంత వాసులుగా పోలీసులు గుర్తించారు. అదే సంఘటనా ప్రాంతంలో ట్రాక్టర్‌ని క్రాస్ చేయబోయి మరోకారు వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో మరో ఇద్దరు మృతి చెందగా ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడే మరో లారీని ఆగివున్న వాహనాన్ని ఢీ కొట్టింది. అర గంట వ్యవధిలోనే అక్కడికక్కడే మూడు ప్రమాదాలు చోటు చేసుకోవడం అందరినీ కలిచివేసింది. మృతుల కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్‌పి దామోదర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రత్యేక క్రేన్‌లు తెప్పించి చిందరవందరగా పడివున్న వాహనాలను తొలగించారు. వివరాల్లోకి వెళితే ఒంగోలు సమీపంలోని నేషనల్ హైవే కొప్పోలు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఒంగోలు నుండి నెల్లూరు వైపు వెళ్ళు మార్గంలో ఆదివారం ఉదయం సుమారు 4.50 నిమిషాలలో మూడు వేరువేరు రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మరణించటం అత్యంత బాధాకరం. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే జిల్లా ఎస్పీ స్వయంగా సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ ప్రమాదం చాలా దురదృష్టకరమని, మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. ప్రమాదం జరిగిన తీరు, కారణాలను మరియు పరిస్థితిని నిశితంగా సమీక్షించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి సమగ్ర విచారణ జరుపుతున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ వెంట ఉప రవాణా కమిషనర్ ఆర్ సుశీల ఉన్నారు. కొప్పోలు నేషనల్ హైవే మీద ఆగి ఉన్న లారీని వెనుక వస్తున్న కోడిగుడ్ల లారీ ఢీకొనటంతో లారీ తిరగబడిన ప్రమాదంలో ముగ్గురు మరణించారు. అదే మార్గంలో సుమారు 500 మీటర్ సమీపంలో ఆగి వున్న కారు మరియు ట్రాక్టర్ ను అదే మార్గం వైపు నుండి వెళ్తున్న లారీ రెండిటిని మిగతా 2 లో ...

ప్రశాంతంగా నీట్ పరీక్షలు

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో ఆదివారం జరిగిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఒంగోలులోని డిఆర్ఆర్ఎం మున్సిపల్ హై స్కూల్, జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయము, దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కాలేజీలలో ఈ పరీక్షలు జరిగాయి. మొత్తం 1473 మంది అభ్యర్థులకుగాను 1428 మంది పరీక్షలకు హాజరైనట్లు పరీక్షల నిర్వహణ సిటీ కోఆర్డినేటర్ మనీష్ తెలిపారు. పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యము కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు, భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. డి.ఆర్.ఆర్.ఎం. మున్సిపల్ హైస్కూల్‌ను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తనిఖీ చేసి సదుపాయాలు, చెకింగ్, భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.

శింగరాయకొండలో న్యాయస్థాన భవనం ప్రారంభం

2లో

కిల్లర్ పిడుగులు

- ◆ పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతి.. ఒకరి పరిస్థితి విషమం
- ◆ జిల్లావాసులను హడలెత్తించిన పిడుగుల

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : బాపట్ల జిల్లావాసుల పిడుగుల ధ్వనులతో ఆదివారం హడలెత్తిపోయారు. గత కొన్ని రోజులుగా ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా ఒక్కసారిగా వాతవరణంలో మార్పులు వచ్చి ఆకాశం మేఘామృతమై ఉరుములు మెరుపులతో కూడిన ఆకాల వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పిడుగులు మోత మోగిపోయియి.పిడుగుల పాటుకు గురై జిల్లాలోని వేరువేరు ప్రాంతాల్లో ఇరువురు వ్యక్తులు మృతి చెందగా మరోకరు ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రేపల్లె,బాపట్ల, చీరాల నియోజకవర్గాలతో పాటు పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు మండలాల్లో చెట్లు విరిగిపడి విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

- జిల్లాలోని చినగంజాం మండలం రామకోటేశ్వరి కాలనీకి చెందిన బ్రహ్మయ్య(50) రొంపేరు పక్కన పోలాల్లో పశువులను మేతకు తీసుకుని వెళ్లాడు. ఈ సమయంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో పిడుగు పడటంతో బ్రహ్మయ్య పోలంలోనే మృతి చెందాడు. మృతునికి భార్య సుజాత, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ పోషణ చూసే యజమాని మృతి చెందటంతో కుటుంబీకులు భోరున విలపిస్తున్నారు. పెద్ద దిక్కున కోల్పోయాం.. ఇక మాకు దిక్కు ఎవరంటూ విలపిస్తున్నారు.

- కృష్ణా జిల్లా మొవ్వ మిగతా 2 లో ...

గిరిజన కులాలకు ప్రాతినిధ్యం ఏది?

- ☞ మైదానప్రాంత గిరిజనులకు తరతరాలుగా అన్యాయం
- ☞ ఎరుకలు, యానాదులు, చెంచులు కమ్మర్లు సుగాలీలకు టికెట్లు ఇవ్వరా?
- ☞ సమస్యలు అసెంబ్లీ దృష్టికి ఇక ఎలా వస్తాయి?
- ☞ మైదానప్రాంత గిరిజన సదస్సులో గళమెత్తిన నేతలు

విశాలాంధ్ర-ఒంగోలు : గిరిజనులకు చట్టపరంగా ఇవ్వాల్సిన రిజర్వేషన్లు కల్పిస్తున్నా... కొన్ని కులాలకు అసలు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోతోందని పలువురు నేతలు గళమెత్తారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం మైదానప్రాంత గిరిజన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, మాజీ డీజీపీ జె.పూర్ణచంద్రరావు, మరో సమన్వయకర్త బక్కా పరంజ్యోతి తదితరులు మాట్లాడారు. ముందుగా మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు మాట్లాడుతూ 'జగన్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం జనాభా 4.32 కోట్లు. అందులో ఎస్టీలు - 25,34,795. మొత్తం జనాభాలో 5.86శాతం. 2011లో కేంద్రం నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 4.94 కోట్లు. నేషనల్ కమిషన్ టెక్నికల్ గ్రూప్ ఆన్ పాపులేషన్ ప్రాజెక్షన్ ప్రకారం రాష్ట్ర జనాభా (10.02.2025 నాటికి) 5.35 కోట్లు. ఎస్టీలలో ప్రధానంగా యానాదులు, ఎరుకలు, సుగాలీలు, చెంచులు కమ్మర్లు కొండ దొరలు, కోయలు, జాతాపులు, కోర్లు, సవర్లు, కొండ రెడ్లు, బగతలు.. ఇలా ఇంకా చాలా మంది ఉన్నారు. వారందరికీ సమానమైన ప్రాతినిధ్యం లేదు. రాష్ట్రంలో కమ్మ, రెడ్ల రాజకీయం ఎక్కువగా నడుస్తోంది. వాళ్లు తప్పనిసరిగా రిజర్వేషన్ల ప్రకారం ఇవ్వాల్సిన ఏడు అసెంబ్లీ సీట్లను ఏజెన్సీ ప్రాంతంలో సర్దేస్తున్నారు. మైదాన ప్రాంత గిరిజనులకు అవకాశం అస్సలు దక్కడం లేదు. రాయలసీమ, కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాల్లోని మైదాన ప్రాంతంలో ఎస్టీలకు అస్సలు ఎస్టీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయడం లేదు. ఏజెన్సీ ప్రాంతాలకు సర్దేస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ యానాదులు, ఎరుకులు, సుగాలీలు చెంచులు కమ్మర్లు తదితరులుంటారు. మొత్తం ఎస్టీలలో వీళ్లే ఉంటారు. కానీ, యానాదులు, ఎరుకలకు అస్సలు ఎమ్మెల్యే టికెట్లే దక్కడం లేదు. ఎప్పుడో ఒకసారి వెంకటేశ్వర్లు అనే నాయకుడు, పెంచలయ్య యానాది నాయకుడు ఎమ్మెల్యేలు అయినట్లు తెలుస్తోంది. అలాగే ఇటీవలి కాలంలో కుంభా రవిబాబు ఎస్.కోట ప్రాంతానికి చెందినవారు. ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. ఎస్టీలలో అత్యధికంగా ఉన్నవారు యానాది కులస్థులు. వారు మిగతా 2 లో ...

మొదటి పేజీ తరువాయి

ఘోర రోడ్డు ప్రమాదాలు

ఢీకొనగా ఎటువంటి ప్రమాదం జరుగలేదు. సుమారు 500 మీటర్ల సమీపంలో అదే మార్గంలో ఆగి ఉన్న కారును నెల్లూరు వైపు వెళ్తున్న కారును వెనుక ఉన్న లారీ బలంగా ఢీకొనటంతో ఇద్దరూ మరణించగా ఒకరికి తీవ్రమైన రక్త గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ మరియు సంఘమిత్ర హాస్పిటల్ కి పంపటం జరిగింది. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీస్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టామన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి చర్యలు తీసుకున్నామని, వాహనదారులు ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలను అరికట్టడానికి జిల్లా పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి లోపాలను అన్ని శాఖల సమన్వయంతో సరిదిద్దుతామని, రోడ్డు భద్రతా ప్రమాణాలపై వాహనదారులకు, ప్రజలకు తరచూ అవగాహన కార్యక్రమాలను నిర్వహించి ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తామని, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తూచా తప్పక పాటించాలని, డ్రైవర్లు వేగ పరిమితుల పట్ల జాగ్రత్త వహించి పరిమితమైన వేగంతో వెళ్లాలని, రహదారి భద్రత సూత్రాలపై అవగాహన కలిగి ఉండాలని, ప్రజలు ప్రతి ఒక్కరూ ప్రయాణ జాగ్రత్తలు పాటించాలని, వాహనాలు నడిపే సమయంలో సహనంతో ఉండి సురక్షితంగా, క్షేమంగా గమ్యాన్ని చేరాలని కోరారు. జిల్లా ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కే నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పి ఆర్ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్, గిద్దలూరు సిఐ సురేష్, నేషనల్ హైవే అధికారులు, ఎస్సైలు మరియు సిబ్బంది ఉన్నారు.

కిల్లర్ పిడుగులు

మండలం కోసూరుకు చెందిన మాతంగి సుప్రదీప్ (23), తన స్నేహితుడు పాగోలు అనీల్‌కుమార్‌తో కలసి ఆదివారం మధ్యాహ్నం సమయంలో ద్విచక్ర వాహనంపై బాపట్ల జిల్లా గాజుల్లంక వైపు వస్తున్నాడు. వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న సుప్రదీప్ పని మాట్లాడుకునేందుకు కృష్ణా నదిలోని గాలుమార్గం ద్వారా గాజుల్లంక వైపు వస్తుండగా నది మధ్యలోకి వచ్చే సమయానికి పిడుగులతో కూడిన వర్షం ప్రారంభమైంది. వారు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ప్రాంతంలో పిడుగు పడటంతో సుప్రదీప్ అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వెనుక కూర్చున్న అనీల్‌కుమార్ పిడుగు పడిన అదటుకు వాహనంపై నుంచి కింద పడిపోయి స్పృహ కోల్పోయాడు. కొద్ది సమయానికి తేరుకుని తన స్నేహితుడిని లేపేందుకు ప్రయత్నించి అతను మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడుకి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. కొల్లూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

– కొల్లూరు మండల కేంద్రం సమీపంలో తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అంజి అనే గొర్రెల కాపరి పంట పొలాల్లో తన గొర్రెల మందను మేపుకుంటున్నాడు. అదే సమయంలో వర్షం ప్రారంభమైంది. ఆ సమయంలో తన సెల్ ఫోన్‌లో మాట్లాడుతుండగా పిడిగుపాటుకు గురయ్యాడు. ఆసమయంలో ఆప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడంతో అక్కడే కొట్టుమిట్టాడుతున్న అతనిని పంట పొలాలు నుంచి వస్తున్న కొందరు వ్యక్తులు గమనించి కొల్లూరు పీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు సిఫార్సు చేయడంతో 108 వాహనంలో అక్కడకు తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి గుంటూరు జీజీహెచ్‌కు సిఫార్సు చేయడంతో అక్కడ ప్రాణాపాయ స్థితిలో వైద్యసేవలు పొందుతున్నాడు.

– ఆదివారం అకాల వర్షం దాటికి ఇరువురు వ్యక్తులు మృతి చెందగా ఒకరు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడటంతో ఆయా కుటుంబీకులు తీవ్ర విషాదంలో ఉన్నారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి ఆదివారం ఉదయం జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేసిన ఒక్కసారిగా వాతవరణంలో మార్పులతో ఈదురుగాలులతో కూడిన వర్షంతో పిడుగులు పడ్డాయి.అప్పటికే ఒకరు గేదెలను మేతకు పొలంలోకి తీసుకుని వెళుతుండగా మరోకరు పని మాట్లాడుకునేందుకు వస్తుండగా వస్తుండగా దుర్ఘటన చోటుచేసుకుంది.దీంతో ఆయా కుటుంబీకులు తీవ్ర విషాదంలో ఉన్నారు.

శింగరాయకొండలో న్యాయస్థాన భవనం ప్రారంభం

విశాలాంధ్ర-సింగరాయకొండ : హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు సింగరాయ కొండలోని సివిల్ కోర్టు నూతన భవన ప్రారంభో త్సవానికి ఆదివారం హాజరై శిలాఫలకాన్ని ఆవిష్క రించడం జరిగింది. అనంతరం కోర్టు భవనానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మధరావు ప్రారంభోత్సవం చేశారు,తదుపరి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ వై. లక్ష్మణ రావులు కోర్టులోని కార్యాలయాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన హైకోర్టు న్యాయమూర్తు లకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికతం జరిగింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీమతి ఏ. భారతి అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ టి. రాజశేఖర్ రావు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఈ కోర్టు చాలా అవసరమని, ప్రతి ఒక్కరికీ న్యాయం అందే విధంగా ఈ కోర్టు ఉపయోగపడుతుందని, ఈ కోర్టు రావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిదంగా జస్టిస్ కే.మన్మధరావు మాట్లాడుతూ శింగరాయకొండకు కోర్టు అవసరమని చాలా ఏళ్ల క్రితమే గుర్తించామని ఇక్కడ న్యాయవాదులు కందుకూరు కోర్టుకు వెళ్లడం ద్వారా వృత్తిపరంగా ఎన్నో కష్టాలు ఎదుర్కొంటు న్నారని, ప్రస్తుతం నలుగురు హైకోర్టు న్యాయమూ ర్తులు శింగరాయకొండకు వచ్చి ఈ కోర్టును ప్రారంభించడం చాలా మంచి శుభ పరిణామం అని పేర్కొన్నారు. అలాగే జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్,జస్టిస్ డాక్టర్ వై. లక్ష్మణరావు మాట్లాడుతూ శింగరాయకొండలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం చాలా ప్రసిద్ధి కలిగిందని, ఈ ప్రాంతం అంతా ప్రశాంతమైన వాతావరణం ఉంటుందన్నారు. ఇలాంటి ప్రాంతంలో ఏర్పాటు చేసిన కోర్టు కక్షిదారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏఆర్ దామో దర్ మాట్లాడుతూ ఈ కోర్టు ద్వారా కేసులు త్వరగా పరిష్కారమై కక్షిదారులకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉందని మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సన్నె బోయిన శ్రీనివాసులు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయమూర్తులు హాజరయ్యారు. అనంతరం న్యాయమూర్తులకు సత్కరించారు. అదేవిధంగా హైకోర్టు న్యాయమూ ర్తులను జిల్లా జడ్జి ఏ.భారతి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నెబోయిన శ్రీనివాసులు మరియు ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

గిరిజన కులాలకు ప్రాతినిధ్యం ఏది?

మొదటి పేజీ తరువాయి

సుమారు 5 లక్షల పై చిలుకు ఉన్నారు. ఆ తర్వాత వరుసగా ఎరుకలు, సుగాలీలు, కొండ దొరలు, కోయలు, జాతాపులు, కోదులు, సవరలు, కొండరెడ్లు.. ఇలా ఉన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 115 మంది ఎస్టీలు ఎమ్మెల్యేలయ్యారు. జనాభా దామాషా ప్రకారం సంఖ్య చూసుకుంటే సరిగ్గానే ఉంటుంది. కానీ యానాది, ఎరుకల, సుగాలీ చెంచులు కమ్మర్లు నుంచి ఇప్పటివరకు ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. ఇది నిజమైన ప్రజా స్వామ్యం ఎలా అవుతుంది? ఇప్పటివరకు ప్రాతి నిధ్యం లేని కులాలకు తప్పనిసరిగా ప్రాతినిధ్యం ఉంటేనే వారి సమస్యలపై అసెంబ్లీలో చర్చించే అవకాశం ఉంటుంది" అని సూచించారు. పూర్ణచంద్ర రావు త్వరలో జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) లోనైనా మైదాన ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలి. వారికి కనీసం మూడు నాలుగు స్థానాలు కేటాయించాలి. మైదాన ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గిరిజన సంక్షేమ పాఠశాలలు, హాస్టళ్లు చాలా అధ్వాన్నంగా ఉంటున్నాయి. వాటికి అరకొరగానే నిధులు కేటాయిస్తున్నారు. అలాగే మైదాన ప్రాంత గిరిజనుల కోసం ఏర్పాటుచేసిన కార్పొరేషన్ కూడా నామమాత్రంగానే ఉంటోంది. దానికి కూడా నిధులు ఇవ్వడం లేదు. ప్రతి జిల్లాలోనూ ఐటీడీఏ ఏర్పాటుచేసి, బ్యాంకులతో సంబంధం లేకుండా గిరిజనుల్లో మైదాన ప్రాంతంలో ఉండేవారిని కూడా సమాజంలో పైకి తీసుకురావాలి. ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలి" అని తెలిపారు. ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎల్ ఎస్టీ నాయకుడు పేరం సత్యం మాట్లాడారు.బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త బక్కా పరంజ్యోతి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్ర బడ్జెట్‌లో ఎస్టీ ఉప ప్రణాళిక పేరుతో నిధులు కేటాయించినట్లు చూపిస్తున్నా, వాస్తవ ఖర్చు దగ్గరకు వచ్చేసరికి మాత్రం వాటిని వేరే కార్యక్రమాలకు మళ్లిస్తున్నారు. గిరిజనులకు ఉపాధి కల్పన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం పెట్టాల్సిన ఖర్చు అస్సలు పెట్టడం లేదు. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా వినియోగించేలా చేయాలంటే ఉద్యమించక తప్పేలా లేదు. అలాగే యానాదులు, ఎరుకలు, సుగాలీల్లాంటి మైదాన ప్రాంత గిరిజనులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలి" అని డిమాండు చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో శ్రీ హర్షిణి విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర -ఒంగోలు : శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఆదివారం టాటా కంపెనీ, ఏసీఈ అకాడమీ వారి ప్రాంగణ ఎంపికలు జరిగాయి.ఈ ఎంపికలలో టాటా ఐటీ కంపెనీలో 3 లక్షల ప్యాకేజీ తో మొత్తం 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. టాటా నాన్ ఐటీ కంపెనీలో 2.3 లక్షల ప్యాకేజీ తో 48 మంది ఎంపికయ్యారు. ఏసీఈ అకాడమీలో 2.4 లక్షల ప్యాకేజీ తో 19 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కర స్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇంచార్జ్ ధీరేష్ మరియు ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

తీగలేరు -5 కాలువ సాధనతోనే కరవు దూరం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : తీగలేరు -5 కాలువ సాధనతోనే కరువు కాటకాలు దూరం అవుతాయని వెలిగొండ ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు జీవీ గురునాథం, జానకి రఘులు అన్నారు. ఆదివారం మండ లంలోని పాత చెరువు తండాలో ప్రజలకు అవగాహనా సదస్సు, ఆవశ్యకతను వివరించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు టీ-5 కాలువ పోరాటం ద్వారా సాధించుకునే పరిస్థితి నెలకొన్నదని అన్నారు. వర్షాభావం మీద ఆధారపడి పంటలు పండించుకునే పరిస్థితి ఉన్నదని భూగర్భ జలాలు పడిపోవటం వల్ల బోర్ల మీద ఆధారపడి పంటలు పండించుకునే పరిస్థితి నేటికి జరుగుతుంద"న్నారు.వేసవిలో మంచినీరు కూడా దొరకక నేటికీ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నా రు.మంచినీటి కోసం ట్యాంకర్ల ద్వారా ప్రభుత్వం కోట్ల రూపాయల ఖర్చు పెడుతుందని, అదేవిధంగా ప్రభుత్వం మంచినీటి దాహార్తి తీర్చేందుకు, ముటుకులలో సమ్మర్ స్టోరేజ్ కి కోట్లు రూపాయలు ఖర్చు పెట్టిందని నేటికీ కూడా సమ్మర్ స్టోరేజ్ ద్వారా 44 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించే దానిలో విఫలమైందని,పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ద్వారా తీగలేరు కాలువ పనులు చేపట్టినట్లయితే మండలం కరువు కాటకాల నుండి పూర్తిగా విముక్తి చెందుతుందన్నారు. పోస్ట్ కార్డు ఉద్యమంలో తీగలేరు సాధన సమితి సభ్యులు, కొర్లకుంట జానకి రఘు, లింగంగుంట్ల రాములు, బంకా శ్రీనివాసరావు ,గురునాథం , నాగిరెడ్డి, రామవత్ నాగేశ్వరరావు నాయక్, సేవియా నాయక్, రాములు నాయక్, శ్రీను నాయక్, లక్ష్మా నాయక్, మంత్రు నాయక్, తాసిల్ నాయక్,తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు సభ్యులను తొలగిస్తున్న వైనం

విశాలాంధ్ర - కనిగిరి: నియోజకవర్గంలోని 6 మండలాలకు సంబంధించిన డ్వాక్రా మహిళా పొదుపు సంఘాల (గ్రూపు సభ్యులకు తెలియకుండానే కొందరు గ్రూప్ సభ్యులను పొదుపు గ్రూపుల నుంచి తొలగిస్తున్నట్లు గ్రూపులోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని వెలుగు కార్యాలయాలలో పనిచేస్తున్నటువంటి కొందరు సీసీలు డ్వాక్రా పొదుపు సంఘాల గ్రూపులలోని మహిళలను వారికి తెలియకుండానే గ్రూపు నుంచి తొలగిస్తున్నారని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మమ్మల్ని ఎందుకు గ్రూపు నుంచి తొలగించారని ప్రశ్నిస్తే ఏవేవో కుంటి సాకులు చెబుతున్నారని. గ్రూపులోని మహిళలను తొలగించి వారికి అనుకూలమైన వారి పేర్లను గ్రూపులో రాయించి గ్రూపులో సభ్యులుగా చేర్చి బ్యాంకుల ద్వారా లోన్లు ఇప్పిస్తున్నారని వారు వాపోతున్నారు. పై అధికారులు వెంటనే స్పందించి అన్ని వెలుగు కార్యాలయాలలోని పొదుపు సంఘాల గ్రూపుల నుంచి తొలగించబడిన సభ్యుల వివరాలు సేకరించి వారిని ఏ కారణం చేత గ్రూపులలో నుంచి తొలగించారు అనే విషయాలపై చర్చించి తగు చర్యలు తీసుకోవాలని తిరిగి డ్వాక్రా పొదుపు సంఘాలలో సభ్యులుగా వారిని చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని కొందరు డ్వాక్రా పొదుపు గ్రూపు సంఘాల మహిళలు పై అధికారులను కోరుతున్నారు.

గొర్రెల పెంపకంతో అధిక లాభాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : గొర్రెల పెంపకం లాభదాయకమైన వ్యాపకం, గొర్రెల పెంపకాన్ని జీవనాధారంగా చేసుకొని ఎంతోమంది రైతులు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయితే మంద బాగా వృద్ధి చెంది లాభాలు రావాలంటే గొర్రె పిల్లల సంరక్షణలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని పశు వైద్యాధికారిని ఎం విజయలక్ష్మి వివరించారు.

పిల్లలకు అందించాల్సిన ఆహారం:-

పుట్టిన గొర్రె పిల్లలు 15 రోజులు తరువాత నుంచి లేత గడ్డి పోచలను తినడం ప్రారంభిస్తాయి. వీటికి రెండు నెలల వయసు వచ్చేవరకు ప్రతి 8 గంటలకు ఒకసారి తల్లిపాలు తాగించాలి. తర్వాత మూడు నెలల వయసు వరకు 12 గంటలకు ఒకసారి తల్లి పాలు తాగేలా చూడాలి. 90 రోజులు తర్వాత తల్లి గొర్రె నుంచి పిల్లలను వేరు చేసి మేతకు తీసుకువెళ్లాలి. మేలురకమైన జొన్న, మొక్కజొన్న, సుబాబుల్, వేప ఆకులను మేపడం వలన పిల్లల త్వరగా ఎదిగి బరువు బాగా వస్తాయి. శుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచాలి. గొర్రె పిల్లల సంరక్షణ: పుట్టిన వెంటనే ముక్కు రంధ్రాల్లో ఉండే జిగురు పదార్థాన్ని తీసివేయాలి. బొడ్డు నరాన్ని రెండు మూడు అంగుళాలు ఉంచి శుభ్రమైన బ్లేడుతో కత్తిరించి టింక్చర్ అయోడిన్ పూయాలి. పుట్టిన వెంటనే 15 నిమిషాల లోపల పిల్లలను తల్లి గొర్రె దగ్గరకు చేర్చి మూడు నాలుగు రోజులు జున్నుపాలు తాగించాలి. వ్యాధుల నిరోధానికి: గొర్రె పిల్లలు పుట్టిన తర్వాత 7,8,9,రోజులకు యాంటీబయాటిక్,10,11,12, రోజుల్లో మెట్రానిడాల్ పూరా జీలిడో న్ రకపు మందులను కిలో బరువుకు 9 మిల్లీగ్రాముల చొప్పున తాగిస్తే చాలా వరకు వ్యాధులు రావు. 21వ రోజు అంతర పరాన్న జీవుల నివారణ కోసం నట్టల మందులు తాగించాలి. తర్వాత మూడు నెలలకు ఒకసారి అంతర పరాన్నజీవుల నివారణ మందులు పట్టించాలి. బాహ్య పరాన్న జీవుల నివారణకు ఆరు నెలల వయసు దాటిన పిల్లలకు లీటరు నీటిలో ఒక మిల్లి బ్యూ బ్టాక్స్ మందును కలిపి చర్మంపై పిచికారి చేయాలి. దీంతో చర్మ వ్యాధులు దరి చేరవు. వ్యాధి నిరోధక టీకాలు: గొర్రె పిల్లల్లో మరణాల సంఖ్య తగ్గించాలంటే వ్యాధి నిరోధక శక్తి కోసం టీకాలు తప్పక వేయించాలి. 4 వ నెలలో పారుడు వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. 5వ నెలలో చిటుకవ్యాధి నివారణ టీకాలు, 6వ నెలలో బొబ్బదాల వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించాలి.

దివ్యాంగులకు వీల్ చైర్స్ పంపిణీ

విశాలాంధ్ర-పామూరు : సూర్య చంద్ర సేవా సంస్థ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ డివి మనోహర్ ఆధ్వర్యంలో గాదం చెట్టి సుబ్బారావు సహకారంతో విరువూరు రోడ్డుకు చెందిన యస్.కె బాబు, యస్.కె హజారబీ, యస్. కె ఖాజా మొహిద్దీన్‌లకు వీల్‌చైర్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ పూర్తిగా నడవలేని పేదవారిని గుర్తించి సాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి యస్.డి అమీర్ బాబు, యస్.కె ఖాజా రాంతుళ్ళ,యస్.కె రహిమాన్, సిద్దవ టం తిరపతయ్య, యస్.కె మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని పీవీపురం గ్రామంలోని హెూప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ బాల కీర్తి నిలయము ఆవరణలో రోవి రాల్ల ఫౌండేషన్ స్పెయిన్ వారి సహకారంతో 25 మంది నిరుపేద మహిళలకు 90 రోజుల పాటు ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ ముగింపు కార్యక్రమం సంస్థ ఉపాధ్యక్షులు ఓసీహెచ్ నరసింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా అల్పాదాయ మహిళలకు ఆర్థిక స్వావలంబన ఏర్పడగలదని పేర్కొన్నారు. అనంతరం శిక్షణ పొందిన 25 మందికి ఉచితంగా నాణ్యమైన కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. సర్పంచ్ కేవీ నారాయణ రెడ్డి, హెూప్స్ సంస్థ కార్యదర్శి కె. వెంకటేశ్వర్లు, కోశాధికారి గడ్డం ఓబయ్య, టైలరింగ్ టీచర్లు శాగని వెంకటలక్ష్మి, షేక్ షాహిద్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పిడుగు పడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని ఈదుమూడిలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు ఈదుమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడైన గొర్రెల కాపరి కొండేపి నాగమల్లేశ్వరరావు(42) రోజు లాగే ఆదివారం కూడ తన గొర్రెలను తోలుకొని పొలానికి వెళ్ళాడు దాంతో ఒక్కసారిగా వాతావరణం మార్పుచెంది వర్షంతో పాడు పిడుగు పటడంతో నాగమల్లేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య,ఇద్దరు పిల్లలుతో పాటు వృద్ధాప్య తల్లిదండ్రులు ఉన్నారు.

వైసీపీ రీజినల్ ప్రెసిడెంట్ శివప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా వారింట్లో కలిసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ ప్రెసిడెంట్ దుగ్గిరెడ్డి నారాయణరెడ్డి వారిని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

విప్రో,టీసీఎస్‌లకు శ్రీసాధన విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : శ్రీసాధనలో 2021-2024 విద్యాసంవత్సరం బీఎస్సీ, ఎంఎస్సీఎస్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన కఠారి త్రిష టీసీఎస్ సంస్థకు, 2020-2023 విద్యాసంవత్సరం బి.యస్.సి. యమ్.పి.సి.యస్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన కందగట్ల అజయ్ కుమార్ విప్రో సంస్థకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డా.కప్పు గంతుల మధుసూదన్ తెలిపారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం ద్వారా వివిధ నైపుణ్య కోర్సులలో శిక్షణ పొందిన విద్యార్థులను ఈ రెండు సంస్థలు నిర్వహించిన ఆన్లైన్ వ్రాత మరియు మౌఖిక పరీక్షల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు పంపినాయి. విప్రో మరియు టి.సి.యస్ సంస్థలు నిర్వహించే నియామకాల- ప్రక్రియలో వారు బిట్స్, శాస్త్ర, ఐ.ఐ.టి. వంటి ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల ద్వారా పి.జి. చదువులు చదివేందుకు కంపెనీలు అన్ని ఖర్చులు భరిస్తూ ప్రోత్సహిస్తాయని ప్రతిభా నైపుణ్యాల ఆధారంగా తదుపరి స్థాయి కొలువులకు ఎంపిక చేసు కుంటారని ప్లేస్మెంట్ విభాగా ధిపతి కె.వి.యస్.ఆర్ పవన కుమార్ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు కళాశాల సెక్రెటరీ కరెస్పాండెంట్ డి. రాజగోపాల్ రెడ్డి, డైరెక్టర్లు ఎం.వి కృష్ణారెడ్డి, డా. వెన్నా కృష్ణారెడ్డి, జి.యల్ రమేష్బాబు, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర కుమార్, ప్రాంగణ నియామకాల విభాగం సమన్వయకర్త కె.పవన్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ యమ్. శేషుకుమార్ మరియు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించాలి

స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజషన్ ఆఫ్ ఇండియా

విశాలాంధ్ర-గిద్దలూరు : భారతదేశంలో 42 సం,,రాలుగా విద్యార్థి, యువకులకు చైతన్య పరచి దైవాదేశాలకు అనుగుణంగా సమాజ పునర్నిర్మాణానికి సంసిద్ధులను చేస్తుంది. విద్యాలయాల్లో నైతిక విలువలను పెంపొందిస్తు, ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ కృషి చేస్తుందని ఎం. పి . జే. సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ ఎస్. ఎం. ఖదీర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివారం చిన్న పిల్లలకి, విద్యార్థులకు, యువకులకు నైతిక శిక్షణ కొరకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తుంది. ఇందులో భాగంగా వేసవి సెలవులను పురస్కరించుకొని గిద్దలూరు లోని చిన్న మసీద్ నందు ప్రతి ఏడు లాగానే ఈసారి కూడా హై

స్కూల్ స్థాయి పిల్లలకి నైతికశిక్షణ తరగతులను ఎస్ఐఓ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ 27 నుండి ఈనెల 4వ తేదీ వరకు విద్యార్థులకు నైతిక ఆధ్యాత్మిక సందేశాత్మక శిక్షణా తరగతులను ఎస్ఐఓ నిర్వహించింది. ఇందులో 50 మంది విద్యార్థులు పాల్గొని ప్రయోజనం పొందారు. ఆదివారం నాడు శిక్షణ తరగతుల ముగింపు సమావేశం జరిగింది. స్థానిక సభ్యుడు ఫాజిల్, ఎస్ ఐ ఓ స్థానిక అధ్యక్షులు ఫయాజ్ హుస్సేన్, సభ్యులు ఇంకా మసీదు ఇమామ్‌లు పాల్గొన్నారు.

బేస్తవారిపేటలో నేటి నుండి ఆధార్ ప్రత్యేక క్యాంపు

విశాలాంధ్ర - బేస్తవారిపేట : బేస్తవారిపేట మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 5వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపు నిర్వహించబడుతుందని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకుని అన్ని రకాల ఆధార్ సేవలు పొందాలని ఆయన కోరారు.

దూగుంట ఆదర్శ పంచాయతీగా నిలవాలి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : దూబగుంట ఆదర్శ పంచాయతీగా నిలవాలని ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి అన్నారు. ఆదివారం దూబగుంట పంచాయతీ పడమటిపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో చెత్త సేకరణ డబ్బాలను మహిళలకు ఆమె చేతుల మీదుగా ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడైపోయిన ఆహారపదార్థాలు, పండ్లు లాంటి తడి చిత్తు కాయితాలు పాల ప్యాకెట్లు బాటిల్స్ ఊడ్చిన దుమ్ము లాంటివి వేరు చేసి పొడి చెత్త ఒక బుట్టలో, తడి చెత్త ఒక బుట్టలో వేరుగా చేసి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులు రెడ్డి, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి గట్ల విజయభాస్కర్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కందుల శివరామిరెడ్డి, యేసమ్మ, వర్ధమ్మ, విశ్రాంతమ్మ,దానమయ్య, గురవయ్య,రాజా, సాల్మాన్ మరియు పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

6 నుంచి వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కొనకనమిట్ల మండలంలోని చిన మన గుండం గ్రామంలో ఈ నెల 6,78 తేదీల్లో శ్రీమద్విరాట్, పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆలయ, శిఖర, కలశ, శిల విగ్రహ ప్రతిష్ట మహెూ త్సవాలు నిర్వహిస్తున్నట్లు చినమనగుండం గ్రామ పెద్దలు విగ్రహ ప్రతిష్ట కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రతిష్ట మహోత్సవాలకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు పమిడి వెంకటరావు లు హాజరవుతారన్నారు. ఈ ప్రతిష్ట మహోత్సవాలకు మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని కొమ్మవరం గ్రామానికి చెందిన నూతన వధువు వరుడు అయిన మున్నంగి అశోక్ రెడ్డి, వర్షిని వివాహ మహోత్సవ కార్యక్రమానికి జిల్లా వైసీపీ అధ్యక్షుడు మరియు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా గ్రామస్తులు ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలను మేళ తాళాల మధ్య పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికి పెండ్లి మండపం వద్దకు ఆహ్వానించారు. పెండ్లి మండపం వద్ద సందడి వాతావరణం నెలకొంది. మండల వైసీపీ అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మా నందరెడ్డి, మాజీ వైసీపీ మండల కన్వీనర్ సూది దేవర అంజయ్య, మున్నంగి సంజీవరెడ్డి, కాసు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బత్తుల గృహప్రవేశ వేడుకల్లో ఎంపీపీ గంగసానిలక్ష్మి హుస్సేన్ రెడ్డి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని దూబగుంట పంచాయతీ పడమటపల్లి గ్రామంలో బత్తుల లక్ష్మీ నరసయ్య - రమణమ్మ దంపతుల నూతన గృహప్రవేశ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూతన గృహప్రవేశ వేడుకల్లో ఎంపీపీ గంగసాని లక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి లు పాల్గొని లక్ష్మీ నరసయ్య, రమణమ్మ దంపతు లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి గట్లా విజయ భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులరెడ్డి, మాజీ సర్పంచ్ కందుల శివరామిరెడ్డి, బత్తుల మస్తాన్ రెడ్డి, చెరుకుల చిన్నపరెడ్డి, బోయల్ల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయంలో చదరంగం పోటీలు

విశాలాంధ్ర - బేస్తవారిపేట : వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, డ్రాయింగ్ వేయడం, క్యారమ్స్, చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి, 17 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఫోన్ వాడకం మితిమీరితే ప్రమాదకరం...

- చదువును పక్కనపెట్టి మొబైల్‌తోనే కాలక్షేపం
- ఆన్లైన్ క్లాసుల పేరుతో ఆటలు చాటింగ్‌లు
- బానిసలు అవుతున్న విద్యార్థులు,యువత
- జాగ్రత్త పడకపోతే ప్రమాదమే...

విశాలాంధ్ర-పీసీపల్లి : అరచేతుల్లో ప్రపంచంలో వింతలు విశేషాలు చూసే ఇంటర్నెట్లో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి కానీ నేటి యువత విద్యార్థుల్లో మొబైల్ ఫోన్ వినియోగంపై సరైన అవగాహన లేకపోవడంతో స్మార్ట్ ఫోన్లలో చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారు పిల్లలు అడగగానే వారి తల్లిదండ్రులు ఖరీదైన మొబైల్స్ కంప్యూటర్లు కొనుగోలు చేస్తున్నారు. వాటిని పిల్లలు యువత దేనికి వినియోగిస్తున్నారో తల్లి దండ్రులు కనీస పర్యవేక్షణ కూడా ఉంచకపో వడంతో పిల్లలు విద్యార్థులు అశ్లీలం వైపు ఆకర్షితులవుతున్నారు తెలియని వయసులో జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు ఆన్లైన్ క్లాసులు పేరుతో మొబైల్ ఫోన్ల వాడకం మరింత పెరిగింది విద్యార్థులు చిన్నారులు మొబైల్ ఫోన్స్ ల్యాప్ ట్యాబ్ లకుమరింత దగ్గరయ్యారు పిల్లలు మీతో స్మార్ట్ ఫోన్లలో గూగుల్ వెబ్సైట్లో లాగిన్ అయ్యి అశ్లీలం వైపు ఆకర్షితులై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు మొబైల్ గేమ్స్ చాటింగులు అనవసర వీడియోలు వైపు మల్లుతూ కాలక్షేపం చేస్తున్నారు. కొన్ని యాప్ గేమ్స్ తో సామూహికంగా ఆడుకునే విసులుబాటు ఉంది ఎవరి ఇంటి వద్ద వారి నుండి ఒక గ్రూపుగా ఏర్పడి ఆడుకునే సౌకర్యం ఉండడంతో విద్యార్థులు యువత ఇంటర్నెట్లో ఉంటూ ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ పోటాపోటీగా మొబైల్ గేమ్స్ ఆడుతున్నారు సమయం దొరికితే చాలు మొబైల్లో లీనమైపోతున్నారు. రాని రాను ఈ పరిస్థితి విద్యార్థులపై తీవ్రంగా చూపే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు మానసిక సమస్యలు అధికంగా తలెత్తి మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి కంటే దారుణంగా తయారయ్యే అవ కాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు మొబైల్ గేమ్స్ కు బానిసలుగా మారి మానసిక రుగ్మతులకు లోనవుతున్నారు మానసిక స్థితిని కోల్పోతున్నారు తల్లిదండ్రులు గట్టిగా మందలిస్తే ఇంట్లో వస్తువు లను పగలగొట్టడం తల్లిదండ్రులపై తిరగబడటం మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడడం వంటి సంఘటనలు అనేక ఉన్నాయి. అంతేకాదు తెలియని స్థితిలో హత్య చేసే పరిస్థితిలోకి వెళ్ళిపోతున్నారంటే మొబైల్ గేమ్స్ ఎంత ప్రమాదకరమో ఆలోచించాలి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మానసిక నిపుణులు వైద్యులు తెలియజేస్తున్నారు సోషల్ మీడియాలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో అంతకుమించి దుష్ఫలితాలు ఉన్నాయనేది వాస్తవం.

స్మార్ట్ ఫోన్ అతిగా వాడితే జాగ్రత్త :

ప్రస్తుత పరిస్థితుల్లో మానవుడు ఒక్క పూట అన్నం లేకుండా నేను ఉంటున్నాడేమో కానీ స్మార్ట్ ఫోన్ లేకుండా మాత్రం ఒక గంట కూడా ఉండటం లేదని నిపుణులు సూచిస్తున్నారు నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి ఒకటి లేదా రెండు మొబైల్ ఫోన్లు వాడటం సర్వసాధారణమైపోయింది. మరి ఎక్కువ సేపు మొబైల్ ఫోన్ వాడితే రేడియేషన్ ద్వారా మెదడుకు హాని కలిగే అవకాశం ఉంది దీంతో తల ముక్కు గొంతు మరికొన్ని అవయవాలు లింఫోమా క్యాన్సర్ వ్యాధికి కారణం అవుతున్నాయి.

చిన్నపిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వద్దు :

తల్లిదండ్రుల పర్యవేక్షణ లోపం కారణంగా కొందరు తల్లిదండ్రులు పిల్లలపై అతి ప్రేమ చూపిస్తూ వారు ఏం చేసినా సమర్థించే ధోరణి పెరిగింది కొందరు తల్లిదండ్రులు తమ పనులు చేసుకునే విషయంలో చిన్న పిల్లలకు మొబైల్ గేమ్స్ లో గేమ్స్ ఓపెన్ చేసి ఇస్తుంటారు ఈ విధంగా పిల్లలకు ఫోన్ ఇచ్చి పిల్లలను వీటికి బానిసలు చేస్తున్నారు. ప్రస్తుతం మారిన జీవన విధానంలో తల్లిదండ్రులు పిల్లలతో గడపడానికి కూడా అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా తల్లిదండ్రులు మారం చేస్తున్న చిన్నపిల్లలకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వకుండా జాగ్రత్త పడాలని నిపుణులు తెలియజేస్తున్నారు.

ఆరోగ్యానికి నడక కీలకం

విశాలాంధ్ర- ఒంగోలు : సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి రోజూ పది వేల అడుగుల నడక కీలకమైన వని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చాపల వంశీకృష్ణ పేర్కొన్నారు. శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక రంగారాయుడు చెరువు వాకింగ్ ట్రాక్ మీద ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రముఖ ఎముకలు మరియు కీళ్ళ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలియజేశారు. ప్రతి నెల మొదటి ఆదివారం ఉదయం రంగా రాయుడు చెరువు మీద గాంధీ విగ్రహం వద్ద జరుగు ఈ వైద్య శిబిరంలో భాగంగా జరిగిన ఈ వైద్య శిబిరంలో సుమారు 250 మందికి ఉచితంగా బిపి ,షుగర్, హెచ్ బి మరియు పల్సాక్సి మీటర్ పరీక్షలు, పాదాల నరాల స్పర్శ పరీక్ష ఉచితంగా నిర్వహించి, ప్రముఖ జనరల్ మెడిసిన్ మరియు డయాబెటాలజిస్ట్ డాక్టర్ సానల ధీరజ్ బాబు చే తగిన వైద్య సలహాలు, సూచనలు అందజేయడం జరిగింది. డాక్టర్ సానల ధీరజ్ బాబు మాట్లాడుతూ సంపూర్ణ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ రోజూ పది వేల అడుగులు నడవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కొప్పోలు సామిత్ర పల్లవ్, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్ ,మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గోపి, అనిల్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని నరవ రోడ్డులోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో గిద్దలూరు పట్టణానికి చెందిన చేగిరెడ్డి వెంకట నారాయణమ్మ (టీచర్) కుమారుడు రాహుల్ రామ్ రెడ్డి" మరియు కర్నాటి పెద్ద లక్ష్మిరెడ్డి (టీచర్) కుమార్తె జాహ్నవిరెడ్డిలకు జరిగిన వివాహ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని నూతన వధూ వరులను ఆశీర్వదించి శుభాకాంకలు తెలియచేశారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

విశాలాంధ్ర-గిద్దలూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థుల చేత కథలు చదివించడం, కథలు వ్రాయించడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జి మొదలగు పుస్తకాలు చదివించి చివరగా పిల్లలకు బిస్కట్స్ ఇవ్వడం జరిగింది. ఉపాధ్యాయులు శివప్రసాద్, నాగూర్ వలి, వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కాపు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎన్నిక

విశాలాంధ్ర- ఒంగోలు : కాపు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కొల్లా సుఖదేవ్, సుంకర తిరుమల నాయుడు ఎంపికయ్యారు. ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోవడం జరిగింది.కాపు ఉద్యోగులతోపాటు విద్యార్థులకు, విశ్రాంత ఉద్యోగులకు తోడ్పాటుగా ఉండేందుకే 2014లో కాపు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయటం జరిగిందని సుదీర్ఘకాలం పని చేసిన తర్వాత కొన్ని అనివార్య కారణాలతో సంఘం కార్యకలాపాలు కొంతవెనకబడ్డాయని తిరిగి పునరావృతం చేసేందుకు సంఘ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు నూతన కమిటీని ఎంపిక చేయటం జరిగిందని కాపు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. కాపు కళ్యాణ మండపంలో కాపు ఎంప్లాయిస్ కన్వీనర్ వీరప్రతాప్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘ కార్యకలాపాలు నిర్వహించేందుకు నూతన కమిటీని ఎంపిక చేసుకోవటం జరిగింది. నూతన కమిటీని ఏపి కమర్షియల్ టాక్స్ స్టేట్ జనరల్ సెక్రెటరీ కొప్పోలు సుధాకర్ ప్రకటించారు. నూతన కార్యవర్గానికి ఏపీ విద్యుత్ సర్వీసెస్ జనరల్ సెక్రెటరీ తంగా సాంబశివరావు, ఏపీ స్టేట్ మెడికల్ ఎంప్లాయిస్ జాయింట్ సెక్రెటరీ వరదా కృష్ణా రావు, సంఘం వ్యవస్థాపకులు జేష్ఠ వరప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నారిశెట్టి రామ మోహనరావుల మద్దతు తెలిపారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కొల్లా సుఖదేవ్, సుంకర తిరుమల నాయుడు, ట్రెజరర్‌గా పెద్దిశెట్టి సుబ్బారావును, వైస్ ప్రెసిడెంట్లు గా సిరిగిరి రామచంద్ర, వాసాల ప్రసన్నకుమార్, సిరిగిరి శ్రీనివాసరావు, జి ఆంజనేయులు, సాదు నరసింహారావు, జాయింట్ సెక్రెటరీలుగా బ్రహ్మయ్య నాయుడు, సోమశేఖర్, నిశంకం బ్రహ్మయ్య, రమేష్‌లు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా పసుపులేటి అనురాధ ఎన్నికచేశారు. అడ్వైజరీ కమిటీలో చిట్టెం వెంకటేశ్వర్లు, పసుపులేటి మారుతి ప్రసాద్, దండే వెంకటేశ్వరరావు, కొల్లా హనుమంతరావులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు.

పొగాకు పంటను కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - పర్చూరు : పొగాకు పంటను రూ.15,000 తగ్గకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి హరిబాబు తెలిపారు. పర్చూరులో ఆదివారం రైతు సంఘం నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు రైతుల పరిస్థితి రోజురోజుకు దిగజారి పోతుందని,గిట్టుబాటు ధర లేక కొనుగోలు దారులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఇంటి దగ్గర పరదాలు కప్పి పెట్టిన పొగాకుకి ఇప్పుడు వాతావరణ భయం కూడ వెంటాడుతోందన్నారు.వివిధ రైతు సంఘాలు రైతుల పక్షాన నిలబడి తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి అన్నారు.రైతులు తెచ్చిన పొగాకు బేళ్లను తిప్పి పంపవద్దని సూచించారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ కమీషనర్ పొగాకు పండించిన ప్రాంతాన్ని సందర్శించాలని డిమాండ్ చేశారు.రైతులు ప్రభుత్వానికి తమ గోడుని వినిపించేందుకు టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేయాలని కోరారు.బర్లి పొగాకుని టొబాకో బోర్డు పరిధిలోకి తెచ్చి రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య,బాపట్ల జిల్లా రైతు సంఘం కార్యదర్శి టి.రామారావు,కౌలురైతు సంఘం నాయకులు సిహెచ్ గంగయ్య, సిపిఎం నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు,మత్తె డేవిడ్, వణుకూరి శ్రీనివాసరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సింగరకొండ ఈవోపై విచారణకు నోటీసులు

విశాలాంధ్ర - అద్దంకి : సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఈవో తిమ్మా నాయుడు విధులలో నిర్లక్ష్యం వహిస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని అద్దంకి పట్టణానికి చెందిన సంధి రెడ్డి కొండలరావు ఇటీవల దేవాదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విచారణకు ఆదేశిస్తూ ఈవో తిమ్మ నాయుడుకు, ఫిర్యాదుదారుడు సంధి రెడ్డి కొండలరావుకు నోటీ సులు జారీ చేశారు. సోమవారం దేవస్థానం కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఈవోకు, ఫిర్యాదుదారుకు నోటీసులు ఇచ్చినట్లు కొండలరావు తెలిపారు.

పుస్తక పఠనంతో మేధోశక్తి పెంపు

విశాలాంధ్ర-సంతమా గులూరు : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సంతమాగు లూరు మండల కేంద్రంలోని గ్రంథా లయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. బాలబాలికలు లైబ్రరీలోని స్వాతంత్ర్య సమర యోధులు జీవిత చరిత్రలు, జనరల్ నాలెడ్జ్, కథలు, ఆధ్యాత్మిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను పఠనం చేశారు. గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల పుస్తకాలు, ఆట వస్తువులను అందుబాటులో ఉంచారు.

సుబ్బారావుకు స్వర్ణనంది జాతీయ పురస్కారం

విశాలాంధ్ర - జె.పంగులూరు : సామాజికరంగం,సేవారంగంలో విశేష కృషి చేస్తున్న,విశేష సేవలు అందిస్తున్న శ్రీ విశ్వకర్మ సిద్దు సేవా ట్రస్ట్ వ్యవ స్థాపక చైర్మన్ సిద్దు వెంకట సుబ్బారావు జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్,మాచవరం సేవా ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన స్వర్ణ నంది జాతీయ పురస్కారంను సిద్దు వెంకట సుబ్బారావుకు అందజేశారు.హైదరాబాదులోని త్యాగరాజ గాన సుధా భవనంలో ఏర్పాటు చేసిన జాతీయ పురస్కారాల కార్యక్రమంలో మాచవరం సేవా ఫౌండేషన్ చైర్మన్ గౌరీ శంకర్, ఆధ్యాత్మిక గురువు దైవజ్ఞ శర్మ,సాహితీవేత్త సురేపల్లి విజయ, న్యూమరాలజిస్ట్ ముదికొండ గోపికృష్ణ పలువురు ప్రముఖులు సిద్దు సుబ్బారావుకు శాలువాతో ఘనంగా సత్కరించి స్వర్ణనందిని బహుకరించారు. స్వర్ణ నంది జాతీయ పురస్కారం అందజేశారు.సిద్ది సుబ్బారావు చేస్తున్న సేవలను పలువురు ప్రముఖులు కొనియాడారు. గతంలో జాతీయస్థాయిలో ఢిల్లీలో దారుశిల్పి విశ్వకర్మ అవార్డును రెండు తెలుగు రాష్ట్రాలలో సాధించిన ఏకైక వ్యక్తిగా సిద్దు వెంకట సుబ్బారావు ప్రఖ్యాతి చెందారు.సుబ్బారావుకు స్వర్ణ నంది పురస్కారం అందుకోవడం పట్ల ముప్పవరం గ్రామస్తులు, జె.పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రధాని సభకు రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం

విశాలాంధ్ర - అద్దంకి : అమరావతిలో శుక్రవారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అద్దంకి నియోజకవర్గ జై భీం రావు భారత పార్టీ సమన్వయకర్త పులిపాటి హేబెలు విమర్శించారు. ఆదివారం అద్దంకిలో ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధానికి గతంలో టిడిపి హయాంలో శంకుస్థాపన జరిగిందని మరలా ఇప్పుడు శంకుస్థాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో మోడీ రాజధానికి నీళ్లు మట్టి తెచ్చారని ఇప్పుడు చాక్లెట్లు తెచ్చారని ఎద్దేవా చేశారు.

రేపల్లెలో ఈదురుగాలులతో వర్షం

విశాలాంధ్ర - రేపల్లె : అకాల వర్షం బీభత్సాన్ని సృష్టించింది.ఆదివారం ఉవ్వెత్తిన ఎగిసి పడిన కారు మబ్బులు మేఘవృతంగా దట్టంగా అలుముకున్న కారు మబ్బులతో ఒక్కసారిగా దాదాపు మూడు గంటల పాటు ఏక దాటిన ఈదురుగాలులతో కూడిన వర్షం వలన పెద్దపెద్ద చెట్లు, కరెంటు స్తంభాలపై తీగలు తెగిపడి రహదారిపై తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేసవి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలకు ఆదివారం ఒక్కసారిగా కురిసిన వర్షంతో ప్రజలు అతలాకుతలమయ్యారు. రేపల్లె పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. చెట్లు రోడ్లపై పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అంతేకాకుండా విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోవడంతో కరెంటుకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో త్రాగునీరు సరఫరా కూడా అంతరాయం ఏర్పడినట్లు ప్రజలు చెబుతున్నారు.బాపట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా తాసిల్దారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

వైభవంగా లక్ష్మిఅమ్మవారి తిరునాళ్ల

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పూనూరు గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ అమ్మవారి 23వ తిరుణాల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి వినాయకునికి, ఆంజనేయ స్వామికి,నాగేంద్ర స్వామికి,లక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమలతో అర్చనలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అష్టోత్తర శతనా మావళి, పూజా కార్యక్రమం చండీ హోమం, అమ్మవారికి, వసంతోత్సవం, పంచామృత అభిషేకాలు నూతన వస్త్రాలంకరణ నిర్వహించారు. రాత్రి మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయమును విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.ఈ కార్యక్రమాన్ని వంకాయలపాటి సుబ్బారావు, ఉప్పుటూరి సాంబశివరావు, మార్టూరు శంకర్, శివయ్య, ఉప్పుటూరి వాసు, వీరాస్వామి తదితరులు నిర్వహణ బాధ్యతలను నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర-చీరాల రూరల్ : పేరాల జక్కావారి వీధిలో విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడిన జడ సునీల్ పార్థివ దేహాన్ని చీరాల ఏరియా హాస్పిట ల్‌లో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పరిశీలించారు. అధికారులను అడిగి దుర్ఘటన వివరాలు తెలుసుకున్నారు.నిర్లక్ష్యం వహించిన సంబంధిత లైన్ మాన్‌పై తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు.మృతుని కుటుంబానికి అండగా ఉంటానన్నారు.

సామాజిక సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - చీరాల : ఎన్నారై వాసవి అసోసియేషన్, కుసుమ శ్రీనివాస్ కృష్ణ కుమారి సికింద్రాబాద్, ఇతర ఆవోపా సభ్యుల ఆర్థిక సహాయంతో ఆవోపా మహిళా విభాగం చీరాల, ఖమ్మం రోటరీ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కృత్రిమ పాదాలు, క్యాలిఫర్స్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. దివ్యాంగులకు కృత్రిమ పాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా దివ్యాంగులకు కృత్రిమ పాదాలు అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో చీరాల ఆవోపా చైర్మన్ వలివేటి మురళీకృష్ణ, ఆవోపా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

రాతి ముఖమండవానికి రూ.1,01,116లు విరాళం

విశాలాంధ్ర - అద్దంకి : సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవ స్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి అద్దంకి పట్టణానికి చెందిన ధర్మవరపు భాస్కరరావు ధర్మపత్ని సుజాత కుమారుడు కార్తికేయలు ఆదివారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తిమ్మా నాయుడుకు రూ.1,01,116లు విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్లు ఏజెండ్ల ఆంజనేయులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం యధాతధం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై 22మంది మునిసిపల్ కౌన్సిలర్లు ప్రకటించిన అవిశ్వాసం ప్రతిపాదనను బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి సమర్పించారు. ఇందుకు గాను మే నెల 14వ తేదీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.కానీ అనూహ్యంగా చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీలో చేరారు.దీనితో పలువురి మదిలో అవిశ్వాసం విషయమై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.వీటిని నివారించేందుకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య విలేఖర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చైర్మన్‌కు పార్టీలో చేరేటప్పుడు ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు.అవిశ్వాసంలో ఓడిపోతే పదవికి రాజీనామా చేస్తారన్నారు. పార్టీలోకి వచ్చినందు వలన అవిశ్వాసం ప్రతిపాదన ఆగినట్లు కాదన్నారు.యధాతధంగా అవిశ్వాసం జరుగుతుందన్నారు.ఈ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరం లేదన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోండి

– రేపల్లె కార్మిక శాఖ అధికారి ప్రభాకర్

విశాలాంధ్ర – రేపల్లె : ప్రభుత్వ ఉద్యోగులు మినహాయించి కూలీలతో పాటు అందరు అర్హులే, లేబర్ ఇన్సూరెన్స్‌కు తెల్ల రేషన్ కార్డు తప్పని సరి, ఏడాదికి రూ. 22 మాత్రమే చెల్లించి లేబర్ ఇన్సూరెన్స్ సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె కార్మిక శాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాలు ఒకేసారి రూ.110 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.18 నుండి 55 సంవత్సరాలు ఉన్న స్త్రీ,పురుషులు ఇన్సూరెన్స్‌కు అర్హులు, ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ఎలాంటి కూలీలైన, ఇతరు లైన ఇందులో చేరవచ్చు అని ఆయన తెలిపారు.రేషన్ కార్డు,ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు చలానా జతచేసి లేబర్ ఆఫీస్‌లో ఇవ్వాలని తెలిపారు. పాలసీ దారు సహజ మరణం పొందితే రూ. 1.30 లక్షలు ఇన్సూరెన్స్,అలాగే ప్రమాద వశాత్తు మరణం సంభవిస్తే రూ. 6 లక్షలు, ఒక ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే ఒకొక్కరికి వివాహ నజరానా రూ. 30 వేలు పొందవచ్చునన్నారు. ప్రసవ కానుకగా రెండు ప్రసవాలకు రూ. 30 వేలు చొప్పున వచ్చే అవకాశం ఉందని చెప్పారు.ఒక సంవత్సరంపాలసీ పొందిన తరువాత లబ్ధిదారునికి ప్రమాదం జరిగి 50 శాతం వికలాంగులుగా ఉంటే రూ. 2.50 లక్షలు,అదే 100 శాతం ఉంటే రూ.5 లక్షల పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. ఈ లేబర్ ఇన్సూరెన్స్ ఒకసారి రూ. 110చెల్లిస్తే 5సంవత్సరాల వరకు చెల్లించ నక్కర్లేదన్నారు. మీమండలంలోని కార్మిక అధికారిని(లేబర్ఆఫీసర్) ఎంపీడీవో, ఎమ్మార్వో, కార్యాలయాలలో సంప్రదించవచ్చునన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి కుటుంబం ఈ పథకానికి అర్హులే అని లేబర్ ఆఫీసర్ తెలిపారు.

గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర – పిట్టలవాని పాలెం : ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బ రత్నమ్మ చందోలు శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సమ్మర్ క్యాంప్ల నిర్వహణ, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఈ సమ్మర్ క్యాంపు ను నిర్వహిస్తున్నామని విద్యార్థులు ప్రతి ఒక్కరు గ్రంథాలయానికి వచ్చి సమ్మర్ క్యాంప్ లను సద్వినియోగం చేసుకొని కొత్త విషయాలను తెలుసుకోవాలని సూచించారు.పాఠ్య పుస్తకాలే కాకుండా గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి విజ్ఞానవంతులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్

విశాలాంధ్ర – పిట్టలవాని పాలెం : మండలంలోని చందోలు శాఖా గ్రంథాల యంలో ఆదివారం గ్రంథాలయాధికారి కొడాలి మస్తాన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో 21 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులచే కథలు చదివి వినిపించి, వారిచే చెప్పించారు. అనంతరం విద్యార్థులు చే క్యారమ్స్, చెస్, మొదలగు ఆటలు ఆడించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

క్షతగాత్రుడికి వి రిసార్ట్స్ అధినేత చేయూత

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : బాపట్ల మండలం అడివిపల్లిపాలెం పంచాయతీ ,కృపనగర్ గ్రామంలో ఎరీపిల్లి కామేశ్వరరావు రైలు ప్రమాదానికి గురైయ్యారు. ఈ నేపథ్యంలో వి రిసార్ట్స్ ఎండి సందీప్‌కి గ్రామ టీడీపీ పార్టీ నాయకులు శివ గోగు తెలపటంతో వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు అందజేశారని తెలిపారు. అడిగిన వెంటనే స్పందించి సహాయం చేసినందుకు సందీప్‌కి కుటుంబ సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

చీరాలలో వర్ష భీభత్సం

విశాలాంధ్ర – చీరాల : ఉరుములు, మెరుపులతో కూడిన అకాల భారీ వర్షానికి పలుచోట్ల పిడుగులు పడి బీభత్సం సృష్టించాయి. పట్టణం లోని మేరీ క్రిస్టియన్ పేటలో పిడుగుపాటుకు కొబ్బరి చెట్టు తగలబడింది. వేసవి కాలం ఎండలు మండుతున్న ప్రస్తుత తరుణంలో ఒక్కసారిగా దట్టమైన మేఘాలు కమ్ముకుని, ఈదురుగాలులతో వర్షం విరుచుకు పడింది. చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. కళ్ళు జిగేల్ మనే మెరుపులు, విపరీత శబ్దంతో కూడిన ఉరు ములు, పిడుగుపాటు దృశ్యం ఘటనతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి అయ్యారు. కొత్తపాలెంలో ఓ పశువుల పాక సమీ పంలో పిడుగు పడటంతో సుమారు 90,000 విలువ కలిగిన రెండు ఎద్దులు మృతిచెందాయి. పట్టణంలో రెండు గంటలు ప్రజలను భీతావ హులను చేసిన వర్షం శాంతించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

భూదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీకారం

విశాలాంధ్ర – పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ భగలాముఖి అమ్మవారి ఆలయం ఎంతో ప్రసిద్ధిగాంచినది. ఈ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అవసరమైన భూమిని సేకరిం చడం ద్వారా భక్తు లకు విశిష్ట సేవలు అందించవచ్చునని అందుకు అవసర మైన భూదాన శ్రీకారం ఎంతో ప్రశస్తమైనదని, అమ్మవారి ఆలయ ప్రాచీన బంగారు ఆభరణముల శోభాయాత్రకు విచ్చేసిన సందర్భంలో భూదాన కార్యక్రమానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్రవర్మ శ్రీకారం చుట్టారు. అయన చెప్పిన స్ఫూర్తితో ఆ సమయంలో అక్కడి భక్తులలో అప్పటికప్పుడు అనేకమంది విరాళములు ప్రకటించారు. వారిలో తోలుతగా బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్ర వర్మ అమ్మవారి గర్భాలయములో అవసరమైన పద్మశాలాపీఠము, పంచలోహ నిర్మిత సింహములు దాదాపుగా రూ. 11 లక్షలు వెచ్చించి తమ సంస్థ ద్వారా అందిస్తామని బాపట్ల ఎమ్మెల్యే వేగేసన నరేంద్ర వర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా తెల్లబాటి శ్రీనివాసరావు దంపతులు ఒంగోలు రూ. 2,16,000, సనక రఘువంశీ రేపల్లె రూ. 2 లక్షల పదహారు వేలు,తలశిల శివప్రసాద్ పొన్నూరు రూ.లక్ష 16 వేలు, కొనకాల బుల్లిబాబు వెల్లటూరు రూ. 1,16,000, దేశ్వాల్ సింగ్ నెల్లూరు రూ. 1,16,000,దేశిరాజు చంద్రశేఖర ప్రసాదు గుంటూరు రూ.లక్ష 16 వేలు,దొంతి రెడ్డి కోటిరెడ్డి భవనంవారిపాలెం రూ. 1,16,000 విరాళాలు ప్రకటించారని ఆలయ కార్యనిర్వహ ణా ధికారి జి.నరసింహమూర్తి ఆదివారం తెలిపారు.

విజయవంతంగా అమ్మవారి ఉత్సవాలు

విశాలాంధ్ర – పిట్టలవానిపాలెం : మండలంలోని చందోలు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీభగలాముఖి అమ్మవారి ఆలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న అమ్మవారి వార్షిక మహోత్స వాలు ఆదివారం భక్తుల సద్ది నివేదనలు, పొంగళ్లతో మొక్కుబడులతో విజయ వంతంగా పూర్తయ్యాయి. ఆదివారం అమ్మవారికి శ్రీమాతా మహాదేవిగా విశిష్ట అలంకారం చేశారు. ఈ ఐదు రోజులపాటు ఒక్కొక్క రోజు విశిష్ట అలంకారములు,6 గ్రామాలలో గ్రామోత్స వములు ఆధ్యాత్మిక కార్యక్రమములు నాలుగవ రోజు పసిడి ఆభరణముల శోభాయాత్ర వివిధ ప్రజాప్రతినిధులు అధికారులు హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఐదు రోజులు పాటు ఆలయానికి చందోలు ఎస్సై ఎం. శివకుమార్ వారి సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు,డిప్యూటేషన్ సిబ్బంది,ఇతర గ్రామాల నుండి వచ్చిన సేవా కార్యకర్తలు చేసిన సేవలు భక్తులకు ఎటువంటి అసౌకర్య ములు కలుగకుండా చేసినందుకు ఆలయం తరుపున ప్రత్యేక కృతజ్ఞతలని ఆలయం కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి చెప్పారు.

బీజేపీ సభ్యులకు నియామక పత్రాలు

విశాలాంధ్ర – చీరాల రూరల్ : భారతీయ జనతాపార్టీ చీరాల రూరల్ మండల సమావేశం బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులుగా నియమింపబడిన వారికి నియా మక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బక్క దుర్గా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఉపాధ్యక్షులుగా బ్రహ్మయ్య, గోపాలకృష్ణ, వైష్ణవ్, బలరాం సింగ్‌లు, ప్రధాన కార్యదర్శులుగా కాళికా, రఘునాథ్‌లు, కార్యదర్శులుగా కృష్ణార్జున, లక్ష్మయ్య, రమేష్, ప్రభుకుమార్‌లు, కోశాధికారిగా శైలజ నియా మక పత్రాలను బండారుపల్లి హేమంత్ కుమార్, మువ్వల వెంకట రమణా రావు చేతుల మీదుగా అందుకున్నారు. నూతన కమిటీ సభ్యులను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పింజల భరణీరావు, నాసిక శివాజీ, వెంకటేశ్వర రావు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర – చెరుకుపల్లి : 25 సంవత్సరాల తర్వాత తమతో పాటు చదివిన సహచర విద్యార్థులను కలుసుకోవడంతో వారందరి మదిలో ఆనందం ఉప్పొంగింది. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ చేస్తున్న ఉద్యోగం, వ్యాపా రం, వివాహం, సంతానం తదితర విషయాలను చర్చించుకుంటూ సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. గుళ్ళ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-2001 పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలిశారు. సుదూర తీరాలలో ఉద్యోగాలు చేస్తూ ఉన్నత విద్యల కోసం జిల్లాలు రాష్ట్రాలు దాటి చదివి ఏదో వృత్తిలో స్థిరపడిపోయిన వారు ఒక్కసారిగా కలవడంతో వారు చదువుతున్న సమయంలో చేసిన చిలిపి అల్లరి, ఉపాధ్యాయుల చేతిలో తిన్న దెబ్బలు పాఠశాలలోని ఫిర్యాదుతో తల్లిదండ్రులతో తిన్న చివాట్లు కలగలిపి మధుర స్మృతిగా నెమరు వేసుకు న్నారు. సాయంత్రం సమయంలో ఆటల పోటీలు సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించి మధురమైన జ్ఞాపకాలను మూట కట్టుకొని వారి స్వస్థలాలకు తరలి వెళ్లారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

విశాలాంధ్ర-అమరావతి: వేసవిలో ఊరు వదలి వెళ్లే వారు పోలీసు శాఖ ఆధ్వర్యంలోని లాక్డ్ హౌస్ మానిట రింగ్ సిస్టంను సద్వినియోగం చేసుకోవాలని అమరావతి సి.ఐ. అచ్చయ్య చెప్పారు. ఆదివారం ఆయన మాట్లా డుతూ గ్రామాలలో వేసవిలో జరిగే అధిక దొంగ తనాలను దృష్టిలో పెట్టుకొని, పాఠశాల సెలవులు దృష్ట్యా దూర ప్రాంతాలకు ప్రయాణం చేసేవారు తమ ఇళ్లలో ఎలాంటి విలువైన వస్తువులు ఉంచకుండా వారితో పాటు తీసుకుని వెళ్లలని సూచించారు. బంగారం విలు వైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాల న్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే ముందు ఆయా గ్రామంలో గల మహిళా పోలీసులకు గానీ అమరావతి పోలీస్ స్టేషన్లో గాని సమాచారం అందజేస్తే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంను ఏర్పాటు నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

టీడీపీ బూత్ కమిటీల ఎన్నిక

విశాలాంధ్ర - వినుకొండ : టీడీపీ జాతీ య అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు యూనిట్ ఇన్చార్జి రియల్ ఎస్టేట్ జానీ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణం లోని 15, 20 వార్డుల పార్టీ కమిటీలు వేశారు. 15 వార్డు ప్రెసిడెంట్‌గా షేక్ కారుమంచి మీరావలి బూత్ కన్వీనర్‌గా పారెళ్ల విజయ్‌లను ఎన్నుకోగా 20 వార్డు ప్రెసిడెంట్‌గా ముప్పూరి రాములు, బూత్ కన్వీనర్‌గా బొంకూరి కోటేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి పత్తి పూర్ణ చంద్రరావు, 20వ వార్డు కౌన్సిలర్ నంది నరసింహా రావు, కాలంగి శ్రీనివాసరావు, పారెళ్ల సుబ్రహ్మణ్యం, బొంకూరి రోశయ్య, బత్తుల వెంకట్రావు, బాండ్ టైలర్, మహిళా నాయకురాలు ముప్పూరి చౌడమ్మ, లక్ష్మీ సామ్రాజ్యం, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - దాచే పల్లి : వేసవి దాహా ర్తిని తీర్చేందుకు కొట్ల బజారులో తాజాగా చలివేం ద్రాన్ని ప్రారంభించారు. ఆతుకూరి బుచ్చేశ్వరరావు దుకాణం వద్ద పల్నాడు జిల్లా ఆర్య వైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పెట్టిన ఈ చలివేంద్రం ఖర్చు రోజూ రూ.500 అవుతోంది. ప్రతి రోజూ ఒకరు చొప్పున ఈ ఖర్చును భరిస్తారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘీయులు, వ్యాపార వర్గీయులు పాల్గొన్నారు.

దొరికిన సూట్ కేసు పోలీసులకు అప్పగింత

విశాలాంధ్ర-దాచేపల్లి : తంగెడ వైపు నుంచి ఆదివారం దాచేపల్లి వస్తున్న ఓ కారు పై నుంచి సూట్ కేసు కింద పడింది. అదే మార్గంలో నారాయణపురంలోని మన్సూర్షాపేటకు చెందిన సయ్యద్ మహబూబ్ సుభానీ పిన్నెల్లి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. కారు పై నుంచి కింద పడిన ఆ సూట్ కేసును సుభానీ గుర్తించి దాన్ని తీసుకొని ఆ కారులో వారికి అప్పగించా లని ప్రయత్నించాడు. అయితే ఆ కారు స్పీడ్‌గా వెళ్లడంతో సాధ్యం కాలేదు. వెంటనే దాచేపల్లి స్టేషన్‌కు వెళ్ళి ఆ సూట్ కేసును పోలీసులకు అప్పగించాడు.

నేడు 'పెనుగొండ'కు అభినందన సభ

విశాలాంధ్ర - వినుకొండ : కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (2024) గ్రహీత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు, న్యాయవాది పెనుగొండ లక్ష్మీ నారాయణకు విద్యా వంతుల వేదిక ఆధ్వర్యంలో సోమ వారం అభినందన సభ ఏర్పాటు చేయనునట్లు ఆ సంఘ సభ్యులు సీనియర్ న్యాయవాదులు పి.జె. లూకా, సి.హెచ్. ఎన్.ఎల్.మూర్తి వెల్లడించారు. పట్టణంలోని కోర్ట్ ఆవరణ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభ వివరాలు వెల్లడించారు. పెనుగొండ లక్ష్మీనారాయణ 1954 అక్టోబర్ 24న గోవిందరెడ్డి లింగమ్మకు రెండవ సంతానంగా వినుకొండ నియోజకవర్గం, నూజెండ్ల మండలం, చెర్వుకొమ్ముపాలెంలో జన్మించారని తెలిపారు. మన ప్రాంతానికి చెందిన ఆయనకు సాహిత్య రంగంలో చేసిన సేవకు 'దీపిక' అనే వ్యాస సంపుటికి ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించటం వినుకొండ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అని తెలిపారు. జాషువా, పులుపుల వెంకట శివయ్యకి సాహిత్య వారసుడిగా గుర్తింపు తెచ్చుకొన్నారని అలాంటి లక్ష్మీ నారాయణను సత్క రించుకోవటం మన అందరి బాధ్యత అన్నారు. రేపటిలోకి, నూరెళ్ళ పులుపుల, దీపిక, విశేష, అనేక, గుంటూరు జిల్లా సాహిత్య చరిత్రలో పెనుగొండ లక్ష్మీ నారాయణ బహుళ ప్రాచుర్యం పొందారు. 1964లో ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అవార్డును తొలితరం మహాకవి గుఱ్ఱం జాషువా అందుకున్నారని, అనంతరం అదే అవార్డు పొంది 2024లో ఆ ఘనతను పొందారని కొనియాడారు. అంతటి సాహిత్య కృషీవలుడు 'పెనుగొండ'కు సోమవారం సాయంత్రం 5 గంటలకు మునిసిపల్ ఆఫీస్ కార్యాలయ ఆవరణలోని జాషువా కళా ప్రాంగణంలో అభినందన సభ ఏర్పాటు చేశారని, కార్యక్రమానికి అసెంబ్లీ చీఫ్ విప్, శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు ముఖ్య అతిధిగా, జీడీసీసీ బ్యాంకు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ దస్తగిరి, అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివ ప్రసాద్, సీనియర్ న్యాయవాది చేరుకూరి సత్యనారాయణ విశిష్ట అతిథులుగా పాల్గొనే ఈ సభలో వినుకొండ నియోజకవర్గంలోని సాహిత్యాభిమా నులు, కవులు, కళాకారులు, రచయితలు, న్యాయవా దులు, ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విద్యా వంతుల వేదిక సభ్యులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-నరసరావుపేట: పది ఫలి తాలలో ఉత్తమ మార్కులు సాధించిన పట్టణంలోని వరవకట్టకు చెందిన ముగ్గురు విద్యార్థులను నరసరావుపేట ఒకటవ పట్టణ సీఐ ఎమ్.విజయ్ చరణ్, ఎస్సై వంశీకృష్ణ వారి గృహాలకు వెళ్లి అభినందించి అందరి మన్ననలు పొందారు. ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలిసింగ్‌ను నిర్వహించాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించగా ఒకటవ పట్టణ పోలీసులు ఫ్రెండ్లీ పోలి సింగ్‌కు నిర్వచనాన్ని ఇలా తెలియజేశా రు. వరవకట్టకు చెందిన షేక్ హాజీరా పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 600 మార్కులకు గాను 574 మార్కులు, మొహమ్మద్ సనా తయ్యబా 558 మార్కులు, షేక్ హనీఫ్ 539 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా వారు ఆదివారం వరవకట్టలోని ముగ్గురు విద్యార్థుల నివాసాలకు వెళ్లారు. తల్లి దండ్రుల సమక్షంలో శాలువ కప్పి ఘనంగా సన్మానం చేసి పుస్తకాలు పెన్నులను బహుకరించి అభినందించారు.

నీలంపాటి అమ్మవారి కల్యాణం

విశాలాంధ్ర-దాచేపల్లి : ముత్యాలంపాడులోని నీలంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి కల్యాణం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా ఊరి ప్రజలు, మహిళలు ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు తాజాగా శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. నీలంపాటి అమ్మవారి ఆలయ ధర్మకర్త, స్థల దాత పాశం శివారెడ్డి తదితరులు పర్యవేక్షించారు. నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురం 13వ వార్డు కౌన్సిలరు భర్త వందనపు వెంకట్రామయ్య ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కాసు ఆయన్ను పరా మర్శించారు. ఆయన వెంట వైసీపీ శ్రేణులు ఉన్నారు.

ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - దాచేపల్లి : రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో ఆరో తరగతి ప్రవేశాలకు గాను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి చదివిన విద్యార్థులు ఇటీవల పరీక్షలు రాసిన ఫలితాలు తాజాగా వచ్చిన విషయం విదితమే. దాచేపల్లి ఆదర్శ పాఠశాలకు సంబంధించి 246 మంది రాయగా వారిలో 210 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 100 మందికే సీట్లు లభిస్తాయి. అందులో ప్రతిభతో పాటు రిజర్వేషన్ దామాషాలో ఎంపిక చేస్తారు. మాదినపాడు రామ్ నగర్, నడికూడి, దాచేపల్లి ప్రధానం, ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. వారిలో కార్తీకకు 89 మార్కులు, నందితారెడ్డికి 86, స్వర్ణ ప్రియకు 83, తన్వీర్ కు 78, హరిశంకర్, నిత్యావల్లికి 77, గోళ్ళ రిషితకు 75, జయదేవ్, కుసుమ, అభిరాంకృష్ణకు 71, వెంకట శ్రీధర్ కు 70, షేక్ హాజీరా షాజాహాన్ కు 66, అఖిల్, సనకు 62, భువన లక్ష్మీకి 61, చైత్రకు 60 చొప్పున మార్కులు వచ్చాయి. మిగతా విద్యార్థులు పోటాపోటీ ఫలితాలు సాధించారు.

వైభవంగా శ్రీ భారతి మహోత్సవాలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శ్రీ మహా కామేశ్వరి ధర్మ పరిపా లన సంఘం ఆధ్వ ర్యంలో స్థానిక అరం డల్ పేటలో కొలువైయున్న శ్రీ శృంగేరి శ్రీ విరుపాక్ష శ్రీ పీఠములో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ భారతి మహోత్సవాలు అశేష భక్తజనుల సమక్షంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. శిష్యులకు తీర్థ ప్రసాద అనంతరం అన్న ప్రసాదం వితరణ గావించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రతాప భారతి అమ్మవారి ప్రతిష్టా దివసము పట్టాభిషేక సంకల్పము, పట్టాభిషేకము జరిపారు. శ్రీ కళ్యాణానంద భారతి మాంతాచార్య మహాస్వామి వారి జయంతి కార్యక్రమం సోమవారం జరుగుతుంది. హిందూ కళాశాల అధ్యక్షులు ఎస్వీఎస్ సోమయాజి ఆశీ:పూర్వక అక్షరాంజలి జ్ఞాపికను గంభీరానంద భారతి స్వామీజీ ద్వారా పట్టాభిషిక్తులైన పర శివానంద భారతి స్వామి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్లు జి.శివరామకృష్ణ ప్రసాద్, పరమహంస, హైకోర్టు న్యాయవాది కృష్ణ ప్రసాద్, నగర వైదిక ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టా మహోత్సవాలలో ఎమ్మెల్యే యరపతినేని

విశాలాంధ్ర-గురజాల: నియోజకవర్గ శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం విస్తృత పర్యటన చేపట్టారు. మండలంలోని గంగవరం గ్రామంలో జరిగిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయం ప్రతిష్ట మహెూత్సవాలలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, దీవెనలు అందుకున్నారు. ప్రతిష్టా మహెూత్సవంలో భాగంగా చివరి రోజు జరిగిన పూర్ణాహుతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొనగా పురోహితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతి నేని మాట్లాడుతూ గ్రామాల్లో దేవాలయం ప్రతిష్టలు జరుపుకోవడం చాలా సంతోషం అని, అందరూ బాగుండాలి అని భగవంతుని ఆశీస్సులు కోరుకుంటా రని తెలిపారు. పల్నాడు ప్రాంతంలో భక్తి భావం కనపడుతుందని అన్నారు. దేవాలయం నిర్మాణానికి తన వంతు సహాయంగా 1 లక్ష 50 వేల రూపాయలు విరాళం అందించారు. ముందుగా గ్రామం చేరుకున్న ఎమ్మెల్యే యరపతినేనికి దేవాలయం కమిటీ, కూటమి శ్రేణులు ఘన స్వాగతం పలికి ముత్యాలమ్మ అమ్మవారి వారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం గురజాలలోని పల్నాడు కన్వెన్షన్ హాల్ (ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్)లో జరిగిన కన్నెగంటి వారి వివాహ విందులో పాల్గొని నూతన దంపతులను యరపతినేని ఆశీర్వదించారు. స్థానిక గుంటూరు రోడ్ లో ఏర్పాటు చేసిన రాష్ట్ర బీసీ, ఈ డబ్ల్యూఎస్ కార్పొరేషన్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న కుట్టు మిషన్ ఉచిత శిక్షణను ఎమ్మెల్యే యరపతినేని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులు, గంగవరం గ్రామ కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

ఈశ్వర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



విశాలాంధ్ర-నరసరావుపేట: ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆద్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి, గుంటూరు వారితో నుదురు పాడు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి, ఈ.ఎన్.టి వైద్య శిభిరం నిర్వహి ం చారు. ముఖ్య అతిధులుగా సర్పంచ్ గొట్టం చౌడయ్య, ప్రభుత్వ స్కూల్ హెడ్ మాస్టర్ జి.శ్రీనివాస రావు, ఈశ్వర్ కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ షేక్ వశీం మీరా, శంకర కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ షఫాలి, డాక్టర్ శృతి, ఆడియాలజిస్ట్ డా. ఆదిత్య, కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లే శ్వర రావు పాల్గొన్నారు. ఈ మెగా శిబిరంలో మొత్తం 527 మందికి కంటి పరీక్షలు జరగ్గా 184 మంది కంటి శస్త్ర చికిత్సకు అర్హులుగా ఎంపిక చేసి, వీరిని శంకరు కంటి ఆసు పత్రికి సిఫార్సు చేశారు. ఈఎన్‌టి సమ స్యల నిమిత్తం 237 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబి రం లోఎన్.ఎస్.ఎస్ పి ఓహెచ్ గంగాధర్, నుదురుపాడు గ్రామ టీడీపీ నాయ కులు కోసన నాగరాజు, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర- తాడేపల్లి : కార్పొరేషన్ పరిధిలో ఆది వారం ఉద యం కురిసిన భారీ వర్షానికి ఉండవల్లిలో గ్రామ తెలుగు యువత అధ్యక్షులు ఢీకొళ్ళు చైతన్య రేకుల షెడ్డు ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. భారీ గాలివానకు ఇంటిపైన రేకుల కప్పు మొత్తం గాలికి ఎగిరిపోవడంతో ఇల్లు పూర్తిగా దెబ్బతింది. అలాగే మోజెస్‌కు చెందిన పశువుల పాక పూర్తిగా ధ్వంసం అయింది. విషయం తెలుసుకున్న తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ నారా లోకేష్ ఆదేశాల మేరకు వారి కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యలు చేపట్టి ఢీకొళ్ళు చైతన్య కుటుంబానికి రూ.15 వేలు, అలాగే మోజస్ కుటుంబానికి రూ.4 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నాయకులు దోప్పలపూడి జ్యోతి బస్, రాయపూడి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి మోటార్స్ ప్రారంభం

విశాలాంధ్ర-పెదకాకాని : రైతులకు అందుబాటు ధరలో నాణ్యమైన ట్రాక్టర్లు అందించే లక్ష్యంతో వారాహి మోటర్స్ ప్రారంభించామని పార్టనర్స్ కొంగర అభిలాష్ చౌదరి, పర్చూరి కమలేంద్ర బాబు తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఆటోనగర్‌లో వారాహి మోటార్స్ వారు ఐచర్ ట్రాక్టర్ షోరూంను ఆ సంస్థకు చెందిన ఏపీ అసోసియేట్ జనరల్ ప్రెసిడెంట్ సోమశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రమేష్ నాయుడు మాట్లాడుతూ ఐచర్ దేశంలోనే మొదటి ట్రాక్టర్ సంస్థ అని నేటికీ 20 లక్షల ట్రాక్టర్లు వివిధ రంగాలలో ప్రజలకు ఉపయోగపడు తున్నాయని అన్నారు. ఈ టాక్టర్స్ వలన రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయని, రాజధాని నిర్మాణంలో కూడా ట్రాక్టర్లను అన్ని విధాలుగా ఉపయోగించు కోవచ్చని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అరవై తొమ్మిది బ్రాంచ్‌లు ఉన్నాయని రిపేరు వస్తే మొబైల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, పారిశ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా ఉమామహేశ్వరుని శాంతి కల్యాణం

విశాలాంధ్ర - పిడుగు రాళ్ల: గ్రామ దేవత గంగమ్మ తల్లి తిరునాళ్ళలో భాగంగా శ్రీ గంగా సమేత ఉమామ హేశ్వర శాంతి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గంగమ్మ తల్లి జన్మదిన వేడుకల్లో 3వ రోజు ఆదివారం జరిగిన పూజలు, కళ్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొ న్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు కొక్కెర కొండలు ఎమ్మెల్యేకు పూర్ణకుం భంతో ఘన స్వాగతం పలికారు. పూజారి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక హెూమం పూజల్లో ఎమ్మెల్యే పూర్ణా హుతి సమర్పించారు. ఉమా మహేశ్వర శాంతి కళ్యాణ వేడుకల్లో యువనేత యరపతినేని నిఖిల్ పాల్గొని గంగమ్మ తల్లి ఆశీర్వాదం అందు కున్నారు. వేడుకలను తిలకించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. మహా అన్నదానంకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించగా పూల బుట్టలు చేభూని మహిళలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిశారు. కార్యక్ర మంలో పట్టణ, మండల తెదేపా అధ్య క్షులు పాండురంగ శ్రీనివాసరావు, గండికోట వెంకటేశ్వర్లు, మార్కెట్యా యార్డు చైర్మన్ తురక వీరాస్వామి, నాయకులు ఎల్.వి.ఆర్, ముప్పాళ్ల సాంబయ్య, కనిగిరి శ్రీనివాసరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు పాల్గొన్నారు. తిరునాళ్లకు ట్రాఫిక్ సమస్య లేకుండా సీఐ వెంకట్రావు ఆధ్వర్యంలో పోలీ సులు బందోబస్త్ నిర్వహించారు.

20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

- జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర - చీరాల : కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్లుగా విభజించి పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికులకు అన్యాయం చేస్తున్న కేంద్రంలోని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మే నెల 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ పిలుపునిచ్చారు.స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి పెట్టుబడిదారులకు పట్టం కడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికుల హక్కులను హరిస్తున్నారన్నారు.గత మూడు సంవత్సరాలుగా మన రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయకూడదని ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం స్పందించటం లేదన్నారు.ఏఐటియూసీ నాయకులు దేశం లోని కార్మిక సంఘాలైన సీఐటియూ,ఐఎఫ్‌టియూలతో నాయకులతో కలిసి సంబంధిత అధికారులను కలిసి సమ్మె నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సమ్మె సన్నాహక సదస్సులను 7వ తేదీ బాపట్లలోని బీఆర్ అంబేద్కర్ భవన్‌లో 10వ తేదీ రేపల్లెలో, 13వ తేదీ చీరాలలో,15వ తేదీ అద్దంకిలో నిర్వహించి అన్ని సంఘాల సభ్యులను సమ్మెకు సమాయత్తం చేయనున్నట్లు తెలిపారు. కార్మికులందరూ సహకరించి సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలకు నిరసనగా దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు.ఏఐటీయూసి చీరాల నియోజకవర్గ కార్యదర్శి బాసి పైడయ్య మాట్లాడుతూ ఇతర సంఘాల కార్మికులను కలుపుకుని సమావేశం ఏర్పాటు చేసి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి కార్మికుల ఐకమత్యాన్ని,శక్తిని చూపిస్తామన్నారు.20వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మె ద్వారా సత్తా చాటుతామన్నారు.ఏఐటీయూసి చీరాల నియోజకవర్గ అధ్యక్షులు దేవతోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల హక్కులను తుంగలో తొక్కి పెట్టుబడి దారులకు పట్టం కడుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయడానికి చీరాల ప్రాంతం లోని అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని కార్మికులను సమాయత్తం చేస్తామని తెలిపారు.చీరాల నియోజకవర్గ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు మాట్లాడుతూ నేను చెప్పిందే చేయాలనే దృక్పథంతో ప్రధాని నరేంద్ర మోడీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జరుపుతున్న సార్వత్రిక సమ్మె సన్నాహక సదస్సులలో కార్మికులందరినీ కలుపుకుని జయప్రదం చేస్తామని తెలిపారు.

ప్రశాంతంగా నీట్ పరీక్ష

విశాలాంధ్ర - చీరాల : నేషనల్ ఎలిజిబిలిటి కమ్ ఎంట్రెన్స్ టెస్ట్‌ను (నీట్ యు.జి. 2025) ప్రశాంత వాతావరణ ంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు.ఆదివారం,నీట్ యు.జి.పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. చీరాల యార్లగడ్డ అన్నపూర్ణాంబ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ యూజీ 2025 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షకు హాజరైన విద్యా ర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. యార్లగడ్డ అన్నపూర్ణం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో 235 మంది విద్యార్థులు హాజరు కాగా 5 మంది గైర్హాజరైనట్లు అదేవిధంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళా శాల కేంద్రంలో 176 మంది విద్యార్థులను కేటాయించగా 169 మంది విద్యార్థులు హాజరయ్యారని 7 మంది గైర్హాజరైనట్లు ప్రధాన ఆచార్యులు ఆయన దృష్టికి తెచ్చారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నీట్ యూజీ పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగ కుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ఎవరు గుంపులుగా సంచరించకుండా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి,కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.పరీక్షా కేంద్రం వద్ద డిఎఫ్ఎమ్‌డిలు,హెచ్ఎప్ఎండిలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్క అభ్యర్థిని బీడీ టీమ్‌తో తనిఖీ చేయించడం జరిగిందన్నారు. చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు నీట్ యూజీ నోడల్ అధికారి మృదుల, చీరాల తాసిల్దార్ గోపాలకృష్ణ, డిఎల్‌డిఓ పద్మావతి, కళాశాల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.

గొట్టిపాటి శ్రీకృష్ణ తండ్రికి పలువురు నాయకుల నివాళులు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కర్లపాలెం మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ తండ్రి గొట్టిపాటి లక్ష్మినారాయణ ఇటీవల మృతి చెందారు. ఆదివారం పెదకర్మకు జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, విన్నకోట సురేష్‌లు హాజరై లక్ష్మినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట చిలకల సురేంద్ర, కట్టా సుజాత తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం ప్రశంసనీయం: శ్రీధర్‌బాబు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రతిభావంతులైన విద్యార్థులను సత్య సెక్యూరిటీ, ఇన్వెస్టిగేషన్ సంస్థ ప్రోత్స హించడం ప్రశంసనీయమని సీనియర్ ఐఏఎస్ అధికారి, పొగాకు బోర్డు మాజీ ఈడీ అద్దంకి శ్రీధర్ బాబు కొనియాడారు. సత్య సెక్యూరిటీలో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లల్లో పది, ఇంటర్ తరగతుల్లో ప్రతిభ కనపరచిన 20 విద్యా ర్థినీ, విద్యార్థులకు స్థానిక బృందావన గార్డెన్స్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఉపకార వేతనాల పంపిణి కార్యక్రమం జరిగింది. సంస్థ ఎండీ కాళహస్తి సత్య నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విద్యా ర్థులు బాల్యంలోనే తమ లక్ష్యాలను నిర్దే శించుకోవాలన్నారు. దానికి అనుగు ణంగా ప్రణాళికలను రూపొందించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని) మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే సేవ, స్నేహ భావాలను అలవర చుకోవాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లా డుతూ నేడు ఆధునికంగా లభిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. భవిష్యత్‌లో మరింత మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అండగా నిలుస్తా మని అన్నారు. కార్యక్రమంలో ఎరిస్ కంపెనీ జిల్లా అధినేత రత్తయ్య, విశ్రాంత లెక్చరర్ జీవీ రాయుడు, సత్య సెక్యూరిటీస్ మేనేజర్ సత్యసాయి, ఎగ్జిక్యూటివ్ లిడియా, విశ్రాంత డిఎస్పీలు సుబ్బారెడ్డి, భగీరథ బాబు, కెవి నారాయణ, కార్పొరేటర్ సిటీ బస్సు బాబు, మాజీ కార్పొరేటర్ ముత్తినేని రాజేష్, రామినేని సుబ్బారావులు పాల్గొన్నారు.